www.prajasakti.com

ప్రజాశక్తి

5

శనివారం 23 డిసెంబర్ 2023

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు శుక్రవారం రాత్రి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ ఇంటికి వెళ్లి ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడాన్ని ప్రశ్నిస్తున్నారన్న కారణంగా ముఖ్యమంత్రి ఎప్పుడు జిల్లా పర్యటనకు వచ్చినా యుటిఎఫ్ నాయకులకు అర్ధరాత్రి నోటీసులు ఇవ్వడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి పర్యటనను అడ్డుకో వద్దంటూ చిన్న చౌక్ పోలీసులు నోటీసు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మహేష్‌కు నోటీసు ఇస్తున్న చిన్నచౌక్ పోలీస్

పోరుమామిళ్ల పట్టణంలో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు

రహదారులు దిగ్బంధం

- కడపలో మానవహారాన్నిఅడ్డుకున్న పోలీసులు
- తాలుకా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన
- మైదుకూరులో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌ను నిలదీసిన అంగన్వాడీలు
- వేంపల్లెలో ఒంటి కాలిపై నిరసన

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తూనే రహదారులపై బైటాయించి రాస్తారోకోలు నిర్వహించారు. అంగన్వాడీల ఆందోళనపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మైదుకూరు పట్టణంలో అంగన్వాడీ కార్యకర్తలు ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌ను నిలదీశారు. క్షమాపణ చెప్పాలంటూ పట్టుబట్టారు. కడపనగరంలోని ఐటి సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించేందుకు వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిపు తోపులాట చోటు చేసుకుంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల రాస్తారోకోను నిర్వహించకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల ఆంక్షలను లెక్కచేయకుండా అంగన్వాడీలు తమ నిరసనను కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

కడప తాలుకా పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, యూనియన్ నాయకులు

కడప అర్బన్ : కడప అర్బన్, రూరల్ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం రాజీవ్ పార్క్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఐటిఐ రూరల్ వద్ద రాస్తారోకో నిర్వహించేందుకు బయలు దేరగా తాలూకా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నాయకులకు, కార్యకర్తలకు వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరకు తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. సిఐ జోక్యం తీసుకుని నగరంలో అభివృద్ధి పనుల వల్ల ట్రాఫిక్ తీవ్ర అంతరాయం చోటు చేసుకుంటుందని, ఇటువంటి పరిస్థితులలో రాస్తారోకో విరమించుకుని గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. ఇందుకు నాయకులు ససేమిరా అనడంతో చివరకు నిరసన తెలియజేసుకుని అనుమతించారు. రాస్తారోకోకు మద్దతుగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు హాజరయ్యారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి, అర్బన్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి అంజలి దేవి, రూరల్ ప్రాజెక్టు నుంచి యస్. నాగలక్ష్మి, బి. సంటెమ్మ ఎ. స్వర్ణలత, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **మైదుకూరు :** పట్టణంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డిని అంగన్వాడీలు, ఆయాలు నిలదీశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తుంటే తమను దోషులుగా వీడియోలు చిత్రీకరించడం సబబు కాదన్నారు. శుక్రవారం చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి కార్యాలయాన్ని వారు అడ్డుకున్నారు. దీంతో ఆయన వారి వద్దకు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వెంటనే అంగన్వాడీలకు క్షమాపణ చెప్పాలంటూ వారు పట్టుబట్టారు. స్పందించిన చైర్మన్ తాను తీసిన వీడియోను మీకు ఎవరో కట్ చేసి పంపారంటూ సమాధానం ఇచ్చారు. త్వరలోనే పూర్తి వివరాలతో మరొక వీడియో తీసి యూట్యూబ్‌లో పెడతాను అంటూ సమాధానం ఇచ్చారు. తాను అంగన్వాడీ ఆందోళనకు సానుకూలముగా ఉన్నానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో వీలైనంత త్వరగా మాట్లాడి అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు న్యాయం జరిగేలా చూస్తానంటూ హామీ ఇచ్చారు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు శాంతించారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మైదుకూరు పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వారంలోపే అంగన్వాడీల సమస్యలను పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పి శ్రీనివాసులు, సిపిఐ ఏరియా కార్యదర్శి శ్రీరాములు, సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్, మండల సభ్యులు, జహంగీర్ బాష, ఎఐటియుసి నాయకులు శివ రామ్, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సభ్యులు భారతి, ధనలక్ష్మి, చెన్నమ్మ, శోభ, రజియా, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, రమాదేవి, శివలక్ష్మి , వెంకటసుబ్బమ్మ, జ్యోతి, అనూష పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. చాపాడు మండల అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, అరుణ, రామలక్ష్మి, రాధ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ప్రభుత్వం దిగివచ్చి న్యాయమైన అంగన్వాడి సమస్యలు పరిష్కరించేంతవరకు అంగన్వాడీల ఉద్యమం ఆగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మె 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండ్

సర్కిల్‌లో అంగన్వాడీలు అందరూ కలిసి మానవహారంగా నిలిచి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, అంగన్వాడి యూనియన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, నరసమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. **వేంపల్లె :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా వారిపైనే మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఫుడ్ కమిటి కమిషన్ ఛైర్మన్ చింతా ప్రతాప్ రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని వారు బహిరంగా క్షమాపణలు చెప్పాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 11వ రోజుకు చేరుకోవడంతో శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఒంటి కాలిపై నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు సిపిఐ ఏరియా కార్యదర్శి వెంకట రాములు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వెంకట రాము, అంగన్వాడీ సంఘాల మహిళలు సరస్వతీ, శైలజా, సావిత్రితో పాటు అంగన్వాడీలు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ప్రారంభించి 11 రోజులు అయిన సందర్భంగా శుక్రవారం పులివెందుల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో 11 ఆకారంలో అంగన్వాడీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని తహ శీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓ. విజయమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు ఎన్. వీరయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి కలసపాడు సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు ప్రాజెక్టు లీడర్ మేరమ్మ, వినోదా దేవి, రామాపురం సెక్టార్ వి రమాదేవి, కవలకుంట సెక్టార్ కె విజయమ్మ, ఇటుకలపాటి సెక్టార్ లక్ష్మీదేవి, పోరుమామిళ్ల సెక్టార్ రమాదేవి బి జ్యోతి, సిఐటియు మండల నాయకుడు బొజ్జ చెన్నయ్య, సిపిఐ మండల కార్యదర్శి చంద్ర రవికుమార్, ఏఐటియుసి మండల అధ్యక్షుడు పేరయ్య, ఆటో యూనియన్ నాయకుడు చంద్ర, రామయ్య పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు టౌన్‌లో సర్కిల్ :** పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద అంగన్వాడీ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. దీంతో కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ స్తంభించింది. సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు .ప్రభుత్వం తమపట్ల మొండిగా వ్యవహరిస్తే అంతకుమించి జగమొండిగా ఎదిరించేందుకు సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సల్మాన్, ఓబులేసు, శేఖర్ ఐద్వా నాయకురాలు ముంతాజ్ బేగం, రాములమ్మ, వెంకటసుబ్బమ్మ, అంగన్వాడీలు నిర్మల, రాజీ, ఎఐటియుసి నాయకులు సుబ్బరాయుడు విజయ, సురేష్ పాల్గొన్నారు.. **కడప :** అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జిలాని భాష డిమాండ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాసాపేట శివ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతిపక్షంలో తన పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీ కార్మికులపై అపారమైన ప్రేమ వలకబోసి, అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్వాడి లకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారని ఘాటుగా విమర్శించారు

మైదుకూరులో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డిని అడ్డుకున్న అంగన్వాడీలు

ప్రొద్దుటూరులో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు

వేంపల్లెలో ఒంటికాలిపై నిల్చుని నిరసన తెల్పుతున్న అంగన్వాడీలు

చక్కెర పరిశ్రమకు మోక్షమెప్పుడో?

- 'ఉక్కు' పనుల్లో కదలికేదీ
- కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు
- అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణేదీ
- ఏళ్ల తరబడి అందని గండికోట పరిహారం
- నేటి నుంచి జిల్లాలో సిఎం జగన్ పర్యటన

జిల్లా అభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా నడుస్తోంది. 2017లో ప్రతిపక్ష నాయకుని హోదాలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా, 2019లో ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన హామీలు అమలు ఆశించిన రీతిలో అమలు కావడం లేదు. చెన్నూరులో చక్కెర పరిశ్రమ పునరుద్ధరణ, కడపలో స్టార్మ్‌వాటర్ డ్రైయిన్లు, ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ ఏర్పాటు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి ప్రధాన హామీలు అమలుకు ఆమడదూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల పునరుద్ధరణ, కొప్పర్తి పైప్‌లైన్ పనులు, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, ఒంటిమిట్ట చెరువులో జాంబవంతుని విగ్రహం ఏర్పాటు వంటి పనులు ముందుకు సాగడం లేదు. శనివారం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో మూడు రోజుల పర్యటన నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి నత్తనడకన సాగుతోంది. సూపర్ స్పెషాలిటీ, కొప్పర్తి పరిశ్రమలు, గోపవరంలో సెంచరీప్లైవుడ్ పరిశ్రమలు మినహా మిగిలిన హామీలు అమలుకు నోచుకోలేదు. చెన్నూరు చక్కెర పునరుద్ధరణ పనులకు రూ.60 కోట్లను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది 2007లో కీ.శే మాజీ ముఖ్యమంత్రి అప్పటి వైఎస్ సర్కారు తలపెట్టిన రూ.72 కోట్లతో కడపలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ కోల్డ్‌స్టోరేజీకి పరిమితమైంది. ఫలితంగా వర్షాకాలంలో కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటిలో మునకలు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కడపలో రూ.70 కోట్ల విలువైన స్టోమ్ డ్రెయిన్‌ల ఏర్పాటు హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి కడప నగరం మునుగుతోంది. స్టోమ్ డ్రెయిన్ కాల్వల ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్ట డానికి ఇచ్చిన హామీ నిధులు లేక నీరోడుతోంది.

అడ్డంకుల్లోనే ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ

రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ పనులకు మోక్షం లభించలేదు. సుమారు ఐదేళ్లుగా స్థలం ఎంపిక, శంకుస్థాపన దశలోనే మగ్గుతోంది. ఫలితంగా యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి సాకా రమవుతుందో తెలియని దుస్థితి దాపురించింది. రూ.12 కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. నిధుల లేమి కారణంగా సకాలంలో పూర్తి చేయడంపై సందేహం నెలకొంది.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నసిఎం (ఫైల్ ఫొటో)

కొప్పర్తి పైప్‌లైన్ మోక్షమెప్పుడో

రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటి సరఫరా పైప్‌లైన్ సాకారానికి నోచుకోవడం లేదు. నీటి కొరత కారణంగా పారిశ్రామిక పురోగతి వెనకడుగు వేస్తుండడం తెలిసిందే. కొప్పర్తిలోని వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలకు నీటి సదుపాయం అందడం లేదు. ఫలితంగా ఎప్పటికి పూర్తి స్థాయిలో కార్య కలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. కడప, ప్రొద్దుటూరు పాల పరిశ్రమల కార్యకలాపాలు ఆశించిన రీతిలో సాగడం లేదు. ప్రొద్దుటూరులో మూలన పడిన పాలపరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. జగనన్న పాలవెల్లువ వంటి పథకంలో భాగంగా పునరుద్ధరణ కార్యకలాపాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక ప్రహరీకి ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2

జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కోల్డ్‌స్టోరేజీ నుంచి ఎప్పుడు పడతాయో తెలియడం లేదు. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1లో భాగమైన సర్వారాయ సాగర్, వామికొండ రిజర్వాయర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. జిల్లా నీటిపారుదల శాఖ రూ.212 కోట్లతో కూడిన ప్రతిపాదనలు పంపించినప్పటికి పాలనాపరమైన అనుమతుల మంజూరు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రూ.82 కోట్లతో కూడిన మైలవరం రిజర్వాయర్ ఆధునికీకరణ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు.

నిరాశలోనే..నిర్వాసితులు

అన్నమయ్య, గండికోట నిర్వాసితుల కన్నీటిధార ఆగడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణకు రూ.777 కోట్లతో టెండర్లకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. రెండేళ్ల కిందట రిజర్వాయర్ గల్లంతైన ఘటన ప్రజల మస్తిష్కాల నుంచి తొలగిపోలేదు. ఆరు గ్రామాల చెందిన ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. వీరికి ఐదు సెంట్లలో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోంది. గండికోట నిర్వాసితులకు అదనపు పరిహారం కింద రూ.3.25 లక్షలు ఇస్తామన్న హామీ కాగితాలకే పరిమితమైంది.

సిఎం నేటి పర్యటన ఇలా..

కడప : 23న ఉదయం 10.45 గంటకు కడప ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానంలో చేరు కుంటారు. ఇక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో నేరుగా గోపవరం చేరుకొని సెంచరీ ప్లై ఇండస్ట్రీని ప్రారం భిస్తారు. అనంతరం మీడియం డేన్సిటి ఫైబర్ ప్లాంట్‌ను ప్రారంభంచి ఒంటి గంటకు కడప రిమ్స్‌కు చేరుకుంటారు. అక్కడ వైఎస్ఆర్ సూపర్ స్పెషాల్టి హాస్పిటల్, డాక్టర్ వైఎస్ఆర్ మానసిక వైద్యశాలను, కేన్సర్ కేర్ బ్లాక్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తారు. ప్రక్కనే ఉన్న వై.ఎస్.ఆర్. క్రికెట్ స్టేడియానికి చేరుకుని ఫ్లడ్‌లైట్లను ఆవిష్కరిస్తారు. నేరుగా కడప కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని విభిన్న ప్రతిభా వంతులకు ట్రై స్కూటర్స్‌ను పంపిణీ చేస్తారు. అనంతరం రెస్క్యూ ఫైర్ ఎక్విప్‌మెంట్ పరికరాలను, కలెక్టరేట్ ఆధునీకీకరణ పనులను ప్రారంభించి కలెక్టరేట్ లోని కంట్రోల్ రూంను సందర్శిస్తారు. నేరుగా మధ్యాహ్నం 3.10 గంటలకు ఆర్‌టిసి సమీపంలోని అం బేద్కర్ జంక్షన్‌కు చేరుకొని అంబేద్కర్ జంక్షన్ -వైజంక్షన్ మధ్య రోడ్ల విస్తరణ పనులను ప్రారంభిస్తారు. అనంతరం కోటిరెడ్డి సర్కిల్‌కు చేరుకొని దండి మార్చ్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఆధునీకరించిన ఏడురోడ్ల కూడలిని ప్రారంభించి మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసే అంతర్జాతీయ హాకీ కోర్టుకు శంఖుస్థావన చేస్తారు. అనంతరం కడప ఎయిర్ పోర్టు నుంచి ఇడుపుల పాయకు చేరుకుంటారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పోరుమామిళ్ల : పాఠశాలలకు, విద్యాశాఖ అధికారులకు మధ్య వారధిగా ఉండి విద్యారంగ అభివృద్ధికి విశేషకృషి చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఎస్‌టియు భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల సాధనకోసం రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమ్మెకు ఎస్‌టియు సంపూర్ణమద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలపట్ల సానుకూలంగా స్పందించి, వారితో చర్చలు జరిపి, సమ్మెను విరమింపజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకమిటీ కన్వీనర్ వాకా చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గసభ్యులు కుళ్లాయప్ప, నారాయణరెడ్డి, గురయ్య,పుల్లారెడ్డి, శ్రీనివాసులు, అబ్దుల్ హుసేన్, రమణ, సుబ్బారెడ్డి, మండలనాయకులు పుల్లయ్య, జయరామిరెడ్డి, బాల ఓబయ్య, వెంకటసుబ్బయ్య, ప్రదీప్, బాష, బాలచెన్నయ్య పాల్గొన్నారు.

రూ.2 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి

కడప అర్బన్ : సిఎం పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం షాపులన్నీటిని మూయిస్తున్న కారణంగా యజమానులకు బాడుగ వారి దగ్గర పని చేసే కూలీలకు ఒకరోజుకు నష్టాన్ని లెక్కకట్టి రూ. 2వేలు చెల్లించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాత బస్టాండ్ వద్ద ఉన్న మన్సూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నేరుగా ముఖ్యమంత్రి ని కలుసుకుని తమ సమస్యలు చెప్పుకునేందుకు ఆస్కారం లేకుండా ఉందని పేర్కొన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు.

రైతుకు కృతజ్ఞతలు తెలుపుదాం

జమ్మలమడుగు రూరల్ : రైతు సేవలను స్మరించుకుని వారికి కృతజ్ఞతలను తెలియ చేయటం ప్రతి ఒక్కరి విధి అని ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ బి.ఎం.వి.ఎల్ నారాయణ రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్టేట్ బాంక్‌లో బ్యాంక్ మేనేజర్ సి. క్రిష్ణా నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్, రీజనల్ మేనే జర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవం, అన్నదాత దివస్‌గా నిర్వహించు కుంటు న్నామని చెప్పారు. మన దేశానికి వెన్నుముక రైతు అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది మునయ్య, వెంకటేశ్వర రెడ్డి, యలమందరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

కడప అర్బన్ : ఈనెల 28, 29 తేదీలలో సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి కమిటీ కన్వీనర్, సభ్యులు వారికి అప్పగించిన బాధ్యతను తూచా తప్పకుండా పాటిస్తూ, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా సజావుగా జరగడానికి కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను వారే రూపొందించు కోవాలన్నారు.

ఓటు అడిగే హక్కు జగన్ కోల్పోయారు : అఖిలపక్షం

కడప అర్బన్ : తండ్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి తలపెట్టిన ప్రాజెక్టులు, పరిశ్రమలను పూర్తి చేసి కడప జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని నమ్మపలికి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో కడప జిల్లా సమగ్ర అభివృద్ధిని పూర్తిగా అటకెక్కించారని అఖిలపక్ష నేతలు విమర్శించారు. జిల్లా ప్రజల గోడును పట్టించుకుని జగన్‌కు ఓటు అడిగే హక్కును కోల్పోయారని, ఆయన పర్యటనను ప్రజలకు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షత వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు హరి ప్రసాద్, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎ సత్తార్, ఆమ్ ఆద్మీ పార్టీ శ్రీనివాసులు, అవ్వారు మల్లికార్జున, డిఎస్‌పి గుర్రప్ప, జనతాదాల్ ప్రతాపరెడ్డి, సిఆర్‌వి ప్రసాద్ రావు, రసూల్, చిన్న సుబ్బయ్య, కుమారస్వామి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా దగాపడ్డ, వెనకబడ్డ కడప జిల్లా నిత్యం కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిందని చెప్పారు. జగన్ వైఫల్యాలను ఎండగడుతూ పరిశీలనలో, సదస్సులు నిర్వహించి దశలవారి పోరాటానికి సమయత్వం చేస్తామని వారు హెచ్చరించారు.

కాంట్రాక్టర్‌కు కాసులు..ప్రజలకు ఇబ్బందులు

కడప అర్బన్ : ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా బద్వేలు, గోపవరం, కడప, సింహాద్రిపురం, ఇడుపులపాయ, పులివెందులలో పర్యటనలో కాంట్రాక్టర్లకు కాసులు, కార్మికులకు కష్టాలు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గం సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు ఐదు లక్షల మంది ఉన్నారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఆప్కాసు, స్కీం వర్కర్లు అంగనవాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం హెల్త్, విద్య రంగాల్లో ప్రయివేట్ సంస్థల్లో వేల సంఖ్యలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆటో, బిల్డింగ్, హమాలీ రంగాల కార్మికులు రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఉందని చెప్పారు. అంగన్వాడీలు 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారని చెప్పారు. వెంటనే కార్మికుల డిమాండ్లు నెవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు ఆశీర్వదించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. శుక్రవారం నగరంలోని చిలకల బావి దగ్గర ఉన్న బుర్హానుద్దీన్ మస్జిద్ దగ్గర కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తమను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

నూతన ఉత్తేజంలో కార్యకర్తలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం ముగింపు సభ యువగళం– నవశకం విజయవంతం కావడంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నూతన ఉత్తేజంతో ఉన్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ గళం నవశకం సభను విజయవంతం చేసిన బహిరంగ సభ నవశకంతో నభవిష్యత్ అనే విధంగా విజయవంతమైందన్నారు. సభకు నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, దేవగుడి అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. యువగళం పాదయాత్ర విజయోత్సవం రాష్ట్ర రాజకీయ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించిందన్నారు. నవశకం యువగళం మొదలైనప్పటి నుంచి వైసిపిలో భయం పట్టుకుందని చెప్పారు. టిడిపి, జనసేన పొత్తుతో వైసిపిలో ప్రకంపనలు మొదలై జగన్ రెడ్డి ఎమ్మెల్యేలను మారుస్తూ తనలోని భయాన్ని బహిర్గతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, రామ సుబ్బారెడ్డి, సెల్వన్ కుమార్, మని రెడ్డి, ఓబులేసు, జయచంద్ర, బ్రహ్మయ్య, వెంకట్రాంరెడ్డి, బాషా, గంగరాజు, నరసింహ పాల్గొన్నారు.

యంత్రంతో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులో డ్రైనేజీ కాలువలలో యంత్ర సహాయంతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. గతంలో గ్రామాలలో కూలీల ద్వారా పనులు చేపట్టే వారు. పెద్ద కాలువలలో అపరిశుభ్రత నెలకొని ఉండేది. మైదుకూరు – ప్రొద్దుటూరు ప్రధాన రహదారి వెంబడి గ్రామంలో చాలా రోజుల పాటు డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండేది. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు కాలువలలో పూడికతీత పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధనుంజయ బాబు తెలిపారు. డ్రైనేజీ కాలువలలో పూడికతీత పనులకు అనువైన యంత్రాన్ని మంజూరు చేశారు. యంత్రం ద్వారా ఎక్కువ రోజులుగా నిల్వ ఉన్న వ్యర్థ పదార్థాలు, మట్టితో పూడిపోయిన కాలువలలోని వ్యర్థాలను తొలగిస్తున్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని తెలుగు శక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.వి. రామ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బిజెపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని పులివెందుల ప్రజలు గద్దె దింపాలని కోరారు. పులివెందులలో రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. తెలుగు శక్తి చేస్తున్న యుద్ధం ప్రజలందరి కోసమని, ఈ యుద్ధానికి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ అవసరమన్నారు. సిఎం జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు వ్యతిరేకంగానే జగన్ పుట్టినరోజు వేడుకలు ఆడియో సీడీని ఆవిష్కరించామన్నారు.

ఎస్‌ఐగా కూలీ బిడ్డ

ప్రజాశక్తి- చక్రాయపేట

నారాయణరెడ్డి

తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. తమ రెక్కలు ముక్కలు చేసి తమ కొడుకును ఉన్నత చదువులు చదివించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎస్‌ఐగా ఎంపికయ్యారు. వివరాలు.. మండలంలోని చిలేకంపల్లె గ్రామానికి చెందిన వేంపల్లె నారాయణరెడ్డి ఎస్‌ఐగా 2023వ బ్యాచ్‌లో ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటూ ఎస్‌ఐ ఎంపిక కావడం పట్ల బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఆతని తల్లిదండ్రులు వేంపల్లె చెన్నారెడ్డి, వెంకటసుబ్బమ్మలు వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించడానికి ఎంతో తాపత్రయపడుతూ వచ్చారు. తండ్రి చెన్నారెడ్డి మరణం అనంతరం నారాయణరెడ్డికి ఉద్యోగం వచ్చింది. ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు గ్రామానికి ప్రాథమిక పాఠశాలలో చదివారు. ఎనిమిదో తరగతి నుండి పదవ తరగతి వరకు చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యభ్యాసం చేశారు. ఇంటర్ రాయచోటి వివేక్ కాలేజీ, బిటెక్ గుత్తి ఎస్‌కెడి ఇంజనీరింగ్‌ కళాశాలలో చదివారు. ఇంజనీరింగ్ కాలేజ్ చదివి 2017 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2023వ సంవత్సరంలో కర్నూల్‌లో బెస్ట్ రాసి 2023 బ్యాచ్‌లో ఎస్ ఐ ఉద్యోగానికి అర్హత సాధించారు. తమ గ్రామానికి నారాయణరెడ్డి ఎస్‌ఐ పోస్టుకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, బంధువులు సంతోషం వ్యక్తం చేశారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

పులివెందుల రూరల్ : ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులపైనా, కార్మికులపైనా కక్షసాధింపుచర్యలు మానుకోవాలని ఎన్‌ఎంయు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.ఎన్.ఎన్.రావు, డిపో అధ్యక్షులు ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఎన్‌ఎంయు నాయకులు, కార్మికులు స్థానిక ఆర్‌టిసి డిపోలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న చిన్న కేసులతో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బందికి అవసరమైన సెలవులు ఇవ్వాలన్నారు. సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి వారికి ప్రభుత్వ పరంగా అన్ని సెలవులు ఇవ్వాలన్నారు. గ్యారేజీలో ఖాళీలను, ఉద్యోగస్తులను కల్పించి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి కేశవరెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఓబులేసు, బి.ఎన్.రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని కామసముద్రంలో గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో ప్రభాకర్ రెడ్డి (55) మృతి చెందారు. ఎస్‌ఐ వివరాలు మేరకు గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి గురువారం రాత్రి భోజనం చేసిన తర్వాత నీటి కోసం ఫ్రిజ్ వద్దకు వెళ్లి అందులోని ఉన్న నీటిని తీసుకుంటుండగా విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో కుటుంబ సభ్యులు పులివెందుల ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా మృతుని సతీమణి పద్మావతి గత ఏడాది అనారోగ్యంతో మృతిచెందారు. ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని కామ సముద్రం సర్పంచులు, ఎంపిటిసిలు సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

చాపాడు : మండల పరిధిలోని కాశినాయన వృద్ధాశ్రమం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామంకు చెందిన జనిబేటి జయమ్మ(55) మృతి చెందింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మృతురాలు మతిస్థిమితం లేక వృద్ధాశ్రమంలో ఉంటోంది. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. తల భాగం మొత్తం నుజ్జు నుజ్జు అయింది. ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఇద్దరు యువకులు కింద పడటంతో బలమైన గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చాపాడు ఆస్పత్రికి తరలించారు.

‘గణితం పట్ల మక్కువ చూపాలి’

ప్రజాశక్తి -ఖాజీపేట

గణిత శాస్త్రవేత్త పితామహుడు శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని బీరం సుబ్బారెడ్డి పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాస్త్రాలకు రారాజైన గణితం పట్ల పిల్లలు మక్కువ చూపాలని పేర్కొన్నారు. గణిత శాస్త్రజ్ఞుల గురించి వారు సాధించిన ఫలితాల గురించి పిల్లలకు చక్కగా వివరించారు. విద్యా సంస్థల డైరెక్టర్ బీరం స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ రోజూ మన దినచర్య గణితంతోనే ప్రారంభ మవుతుందని, మనం చేసే ప్రతి పని ఏదో ఒక విధంగా గణితంతోనే ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలు గణితంలో రాణించగలిగితే అన్ని రంగాలలో ఉన్నత స్థానాలు సాధిస్తారని చెప్పారు. మన పాఠశాలలో ఎక్కువ శాతం విద్యార్థులు గణితం పట్ల మక్కువ చూపుతు న్నారని తెలియజేశారు. విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన ఉపన్యాసాలు, వ్యా యామ శిక్షణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** విద్యార్థులు గణిత శాస్త్రంలో రాణిస్తే అయా రంగాల్లో నిలదొక్కుంటారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. శుక్రవారం వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, బాలగొండ గంగాధర్, రాజారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్స్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, రాధిక, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** గణితశాస్త్రం మేధస్సును పెంచుతుందని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. దేశం గర్వించదగ్గ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరిం చుకొని శుక్రవారం స్థానిక గీతాంజలి పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, శివరామిరెడ్డి ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో బీరం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు

సత్తా చాటడమే విద్యార్థుల లక్ష్యం

- బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పరీక్షలు ఏవైనా అందులో సత్తా చాటడమే తమ విద్యార్థుల లక్ష్యమని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో చెకుముకి టాలెంట్ టెస్టులో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులకు మెడల్‌తో పాటు, మెమోంటో ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెవివి నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులలో ఆలోచనను రేకిత్తించేలా ఉంటుందన్నారు. విద్యార్థులకు సైన్స్‌పై విజ్ఞాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాలకు తిలోదకాలు ఇచ్చేలా ప్రశ్నపత్రం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో మంచి ప్రతిభను కనబరిచి మండలస్థాయిలో కూడా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలవడం తమ విద్యార్థులకు మాత్రమే సాధ్యమన్నారు. ప్రతి ఏడాది తమ స్కూల్ విద్యార్థులు పాల్గొనడం అందులో ప్రతిభను చూపడం జరుగుతుందని తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన అమృత (10వ తరగతి), గురు తన్మయి (9వతరగతి) ప్రియదర్శిని (8వతరగతి) విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటారన్నారు. వారు అక్కడ కూడా పాల్గొని ప్రథమ స్థానంలో నిలవాలని కోరారు. అనంతరం ద్వితీయ స్థానంలో ఉన్న జ్యోతి స్వరూప, నిహారిక, వాణి శ్రీలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా జెవివి వారిని అభినందించారు. ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు మహబూబ్‌బాష, సైన్స్ ఉపాధ్యాయులు భరత్ కుమార్, హృషీ కేశవ ఆచారి, ఖాసీం, ప్రసాద్ ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

ఇసుక మాఫియాను అడ్డుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వ అధికారులు ఇసుక మాఫియాను అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఇసుకమాఫియా చెలరేగిపోతోందని అన్నారు. అరికట్టాల్సిన ఉన్నతాధికారులు కట్టడి చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్‌పై దాడి జరిగిన సంఘటన బాధాకరమన్నారు. నేడు అటవీశాఖ జీపును తగిలించిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకే భద్రతలు లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదన్నారు. గత నెలలో స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కడప ఎస్‌పి దగ్గరకు తన మంది మర్బాలంతో వెళ్లి ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని కోరారనిచెప్పారు. ప్రొద్దుటూరు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చిన బిగ్ బాస్ ఎమ్మెల్యేనన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని తప్పకుండా ప్రొద్దుటూరు అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకుంటామని తెలిపారు. 11 రోజులుగా అంగన్వాడి కార్యకర్తలు ధర్నా చేస్తుంటే వారి న్యాయమైన కోరికలు వినే సమయం కూడా ముఖ్యమంత్రి లేకుండా ప్యాలెస్‌కు పరిమితమయ్యారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వెంకట కొండయ్య, వద్ది బాలుడు, టిడిపి మాజీ పట్టణాధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ప్రజలకు కరపత్రాలు పంచుతున్న ప్రవీణ్ సతీమణి మౌనిక

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్రంలో పెరిగిపోతున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం చియ్యపాడులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ‘రావాలి జగన్.. కావాలి జగన్ అని.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తాం’ అని ప్రజలను నమ్మబలికి గెలిచాక అభివృద్ధి మరిచిపోయి రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశారని వాపోయారు. నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు. అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుందని రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకట రమణారెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి, బాస్కర్ రెడ్డి, నారపరెడ్డి, వీరశేఖర్ రెడ్డి, మధు, నాయబ్, సలీం, అశోక్,కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక రూరల్ పరిధిలోని ద్వారకా నగర్ కాలనీలో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం బాబు ష్యూ – భవిష్యత్తుకి గ్యారెంటీ పథకాలను ప్రవీణ్ రెడ్డి భార్య మౌనిక , అక్క హరిత ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ద్వారకా నగర్ శ్రీనివాసులు రెడ్డి, కిట్టు, చాగంటి సుబ్బారెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, పెద్దన్న,రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, పర్లపాడు చంద్ర భగత్ సింగ్ కాలనీ పట్నం మా బాష, గోపవరం గగ్గుటూరి గౌస్ మోహిద్దిన్, పెన్నా నగర్ మజీద్,భగత్ సింగ్ కాలనీ ఉమర్, హోటల్ మధు, కొత్తపేట నరసింహారెడ్డి, ఓబులేష్, చౌటపల్లి శివ, నరసింహులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.అంగన్వాడీ కార్యకర్తలు 11 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతూ సెంటర్లు మూసివేసిన విషయం తెలిసిందే. దీంతో అంగన్వాడి సేవలు మూతపడ్డాయి. ఉన్నతాధికారులు సచివాలయ సిబ్బంది ద్వారా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శుభ రత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెమిక్రిస్మస్ వేడుకల్లో టిడిపి, జనసేన నాయకులు

ఆరోగ్యమాత చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : టిడిపి, జనసేన నేతల ఆధ్వర్యంలో నగరంలోని ఆరోగ్య మాత చర్చిలోసెమీ క్రిస్మస్ వేడుకలు ఆమూరు బాలదాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత టిడిపి, జనసేన నేతలు వి.ఎస్. అమీర్‌బాబు, ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి, సుంకర శ్రీనివాసులు విశ్వాసులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆ యేసు ప్రభు చల్లని దీవెనలతో చంద్రబాబు నాయుడు సిఎం కావాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు, 15వ డివిజన్ ఇన్‌ఛార్జి కొండా సుబ్బయ్య, ఉపాధ్యక్షులు, న్యాయవాది లింగాల శివ శంకర్ రెడ్డి ,మాజీ వార్డు నంబర్ జయరాం రెడ్డి, పాలకొండ గుడి మాజీ చైర్మన్ బోగి రెడ్డి ఓబుల్ రెడ్డి , రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కోవేల కుంట్ల శ్రీనివాసులు, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కత్తి రవీంద్ర, నగర మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్, పార్టీ నగర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** మండల కేంద్రంలోని సెయింట్ జెవియర్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ చిన్నారులు వివిధ వేష ధారణలతో అలరించారు. నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ మర్రెడ్డి, కరెస్పాండెంట్ సెల్వి రాయప్పన్, ప్రధానోపాధ్యాయులు శివ జ్యోతి, సెరీనా, సిస్టర్లు మరియా రాణి, ఆగ్నేస్ సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని నారాయణ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎజిఎం చెన్నకేసవ రాజు విచ్చేసి ముందస్తు క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల క్రిస్మస్ తాత వేషధారణ అందరిని ఆకట్టుకుంది, అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత రెడ్డి, ఉపా ధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

27 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : 12 వ పిఆర్‌సి అమలయ్యే లోపల వెంటనే 27 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2024 డైరీని ఆఫర్స్ అకాడమీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.సి.రెడ్డన్న, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సుదా ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 12వ పిఆర్‌సి ప్రకటించిన తర్వాత ఆ కమిటీ ఎక్కడ ఉందో అగమ్య గోచరంగా ఉందని పేర్కొన్నారు. టాపర్స్ అకాడమీ చైర్మన్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ 2024 సంవత్సరంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయపరమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు

విద్యార్థులు లక్ష్యంతో ముందడుగు వేయాలి

- సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు జీవితంలో సుఖంగా ఉండాలంటే ప్రాథమిక దశ నుండే ఒక లక్ష్యంతో ముందడుగు వేయాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. సర్పంచ్ తన సొంత నిధులు రూ 30 వేలతో యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేంపల్లెలోని బాలికల, బాలుర, పాములూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులు యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో పాటు ప్రణాళిక బద్దంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకొనేందుకు అవకాశం ఉందన్నారు. యుటిఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను చదివి పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం ద్వారా పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గుర్తింపు రావడంతో పాటు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పాఠశాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు.. విద్య అనేది తరగని ఆస్తి అన్నారు. అలాంటి విద్యను ఏకగ్రతతో చదివితో అనుకొన్న లక్ష్యం నేరవేరుతుంది అన్నారు. పరీక్ష సమయం దగ్గరలో ఉంది కాబట్టి చదువు పైనే ఎక్కువగా విద్యార్థులు దృష్టి పెట్టాలని కోరారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకొని జగనన్న ఆశయాలను నేరవేర్చాలని కోరారు. అనంతరం స్టడీ మెటిరియల్ అందించిన సర్పంచ్ రాచినేని శ్రీనివాసులకు పాఠశాలలు తరుపున ఉపాధ్యాయులు సత్కారం చేశారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు శివ మునెమ్మ, చెరుకూరి శ్రీనువాసులు, ధర్మారెడ్డి, రామచంద్రారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, విజయభారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమంలో దుప్పట్లు వితరణ

వేంపల్లె : అలయ్యావారిపల్లె సర్పంచ్ రామగంగిరెడ్డి, పావని ఆధ్వర్యంలో శుక్రవారం మదర్‌థెరిస్సా అనాథ వృధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సిఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని చలికాలంలో అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషకరమని ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామగంగిరెడ్డి, వేంపల్లె మండల జర్నలిస్టులు అబ్దుల్ గఫార్, శివ కేశవ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఖదీర్, కల్లూరు సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, వైకాపా నేతలు సోమేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రైతులకు రూ.3 లక్షల రుణమాఫీ చేస్తాం

పులివెందులటౌన్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.3 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి అన్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో సాగవుతున్న బుడ్డ శనగ పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. సాగు వివరాలు ఖర్చులు తదితర వివరాలను ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అనుకూలించక పోవడంతో ఈ దపా సాగుచేసిన శనగ పంట దిగుబడి ఆశాజనకంగా లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే కనీసం కూలీల ఖర్చులు కూడా రావన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా రైతన్నలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఆరు సూత్రాల అమలు కార్యక్రమంలో భాగంగా రైతు రుణమాఫీ పథకానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఒకసారి అవకాశం ఇస్తే విభజన అంశాలు పూర్తిస్థాయిలో నెరవేరుతాయని తిరుపాల్ రెడ్డి వెల్లడించారు.

రామదాసుపురంలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు

చాపాడు : మండలంలోని అయ్యావారిపల్లె పంచాయతీ రామదాసుపురంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. గ్రామంలో రోడ్డు లేక ఇబ్బందులు పడుతూ, ప్రభుత్వ నిధులు లేక రోడ్డు వేయలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామపంచాయతీలోని ప్రజల అవస్థలను స్థానిక టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి శేఖర్ రెడ్డి గమనించి, వారు అడిగిన వెంటనే తాను వ్యక్తిగతంగా రూ.5 లక్షలతో సిమెంట్ ఏర్పాటుకు కృషి చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సంతోషిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

కౌశల్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : కౌశల్ క్విజ్ పోటీల్లో వేంపల్లెలోని బిసి రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ హరిత తెలిపారు. కడప నగరంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఇటివల భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్వర్యంలో కౌశల్ జిల్లా స్థాయి క్విజ్ పోటిలను నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా స్థాయి క్విజ్ పోటిల్లో పోస్టర్ ప్రజెంటేషన్ లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక్కైనట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 36 పాఠశాలలకు చెందిన విద్యార్థులు హజరైనారని అయితే బిసి గురుకుల పాఠశాలకు చెందిన దుర్గ, కీర్తన, వర్షని విద్యార్థులు ప్రతిభ చూపడంతో జిల్లా కౌశల్ సమన్వయ అధికారి విజయ మోహన్ రెడ్డి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈనెల 29,30 తేదీల్లో విజయవాడలోని లయోలా కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటిల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

‘ఆడుదాం- ఆంధ్ర’ను విజయవంతం చేయాలి

ఎర్రగుంట్ల : పట్టణంలో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యా లయలో విద్యా, క్రీడా శాఖలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడదాం ఆంధ్ర కార్యక్రమం కోసం ప్రతి సచివాలయం నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఆయన తెలియజేశారు. వారం దరితోను క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడలను నిర్వహించాల్సిన బాధ్యత క్రీడా శాఖ వారు నిర్వహించాలని ఆయన కోరారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్, పిఇటిలు నాగార్జున, రాజేశ్వరి, మాధవిలత, మున్సిపల్ ఆర్ఒ గంగిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు దాశరథి, ఎలిజిబెత్ రాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE IV ADDITIONAL DISTRICT JUDGE, KADAPA

G.W.O.P.N0.50 of 2023

(In the matter of obtaining permission with regard to the sale of property of minor share of Pernapati Dheeraj)

1)Pernapati Jahnavi, W/o late Pernapati Kanchana Simha, Age: 41 Years, Occ.: House wife,
2) Pernapati Dheeraj,S/o late Pernapati Kanchana Simha, aged 16 years, Occ.: Student,
3) Pernapati Prabhavathi, W/o late Subbanachari, aged 59 years, Occ.: House wife
All are residing at D.No.: 45/227, Balaji Nagar, Kadapa city. **...Petitioners**

Vs

-NIL- **...Respondent**

NOTICE

The above petitioners are filed the above petition to declare as guardian to the person and property of the share of said her minor son. If anybody has objection they may appear on 08-01-2024 by 10:30 A.M. before the above Court and raise the objections. Otherwise orders will be passed according to law.

SCHEDULE

Kadapa District, Kadapa Urban Sub District, Kadapa Town, in the village fields of Nagarajupalle in Sy.No.158/2, an extent of measuring East-West: on North 97 links, East-West: on South 90 links, North-South: on East West 17 links, North-South: on West 15 links, within these boundaries an extent of 72.6 Sq.Yards and in it a Room No.6 bearing D.No.1/441/2, and bounded by East: R.S.Road of RTC Bus stasnd-LIC, West: Property of Madhukar Reddy, North: Property of Suman, South: Property of Prabhavathi, within the limits of Municipal Corporation of Kadapa.

//By Order of the Hon'ble Court//

J. VENKATA SUBBA REDDY,
MADDU RAMESH, B.Tech., LLB.,
Advocates, Kadapa City.
Cell :9059510001.